క్లుప్తంగా

పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ



దాతలు అందించిన పరీక్ష సామగ్రితో విద్యార్థులు

అల్లవరం: గోడిలంక, తూర్పులంక ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు రుద్రరాజు సీతాపతిరాజు మెమోరియల్ ట్రస్టు మరియు మోసుగంటి గంగయ్య మెమోరియల్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు అధ్యక్షులు మోసుగంటి వెంకటేశ్వరరావు, రుద్రరాజు సీతాపతిరాజు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు బాగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించే విద్యార్థులకు నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నూర్జహాన్ బేగం, మల్లపురాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ డిపోలో డ్రైవర్ బీఎస్ నారాయణ అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో డిపోలో ఉద్యోగులు శనివారం ఆరో రోజు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. డ్రైవర్ నారాయణ సస్పెన్షన్ ఎత్తివేయాలని, 1/19 సర్క్యులర్ కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు.

విద్యార్థికి అభినందనలు



ఫైర్ అలారం నమూనాను ప్రదర్శిస్తున్న విద్యార్థి

అమలాపురం టౌన్: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పట్టణానికి చెందిన ఆరో తరగతి విద్యార్థి జ్ఞాన హనీస్ రూపొందించిన ఫైర్ అలారం అగ్ని ప్రమాదాల సమయాల్లో ఎంతగానో ఉపయోగపడుతుందని పట్టణ వాకర్స్ మహిళా క్లబ్ అధ్యక్షురాలు అనంతలక్ష్మి అన్నారు. ఫైర్ అలారం తయారు చేసిన విద్యార్థిని క్లబ్ తరఫున అభినందించారు. విద్యార్థి జ్ఞాన హనీష్‌ను మహిళా వాకర్స్ ప్రతినిధులు అభినందించి సత్కరించారు. టైలర్స్ డేను పురస్కరించుకొని టైలర్ వృత్తిలో రాణిస్తున్న మహిళా టైలర్ కళ్యాణిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పరిశీలన

ముమ్మిడివరం: స్థానిక బల్లగేట్ సెంటర్‌లో ఉన్న అన్న క్యాంటీన్‌ను శుక్రవారం ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ రవివర్మ పరిశీలించారు. క్యాంటీన్‌లోని శానిటేషన్, తాగునీటి సరఫరాను పరిశీలించారు. ఆహారాన్ని రుచి చూసి, నాణ్యతా ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. అసిస్టెంట్ ఇంజినీర్ సుధాకర్, మేనేజర్ నూకరాజు, టౌన్ ప్లానింగ్ అధికారి రాజేష్, హెల్త్ అసిస్టెంట్ రాజు పాల్గొన్నారు.

బీపీఎల్ క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలు ప్రారంభించి బ్యాటింగ్ చేస్తున్న కళాశాల చైర్మన్ సతీష్

అమలాపురం రూరల్: భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో బీపీఎల్ క్రికెట్ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభించారు. బీవీసీ కళాశాలల చైర్మన్ బోనం కృష్ణ సతీష్, పూణేకు చెందిన లలిత్ కోస్లా ఈ పోటీలను ప్రారంభించారు.వారు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. 15 రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్‌లో 8 టీమ్‌లు పాల్గొంటున్నాయని కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు రవి సుధీర్, మురళీకృష్ణ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ జీవీజీ రామారావు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో కళాశాల ఏఓ జక్కం కృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్ మదన్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఇషా, తరాబి నమాజ్‌లు

అమలాపురం టౌన్: రంజాన్ పవిత్ర మాసంలోకి వెళుతున్న అమలాపురం ముస్లింలు ఇషా, తరాబి నమాజ్‌లను స్థానిక మొల్లా ముస్తాఫా మసీదులో శనివారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి ఆకాశంలో కనిపించిన నెల వంకను చూసి ఈ నమాజ్‌లు మొదలుపెట్టారు. ఆదివారం నుంచి మొదలయ్యే రంజాన్ పవిత్ర మాసానికి నాందిగా నమాజ్‌లకు శ్రీకారం చుట్టారు. రంజాన్ నెలలో ముస్లింల చేత ప్రత్యేక నమాజ్‌లు చేయించేందుకు జయపూర్ నుంచి హాఫీద్ అబ్రార్ అమలాపురానికి చేరుకున్నారు. మసీదు అధ్యక్షుడు మొయిన్, మసీదు కమిటీ ప్రతినిధులు షేక్ అహ్మద్ అలీ, ఖ్వాజాబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు, జిల్లా మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ తదితరులు ఇషా, తరాబి నమాజ్‌లు చేశారు.

ప్రకృతి ఒడిలో విడిది



కోరంగిలో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్న పర్యాటక హట్‌లు



బయోడైవర్సిటీ భవనం

- పర్యాటకులు సేదతీరేందుకు ప్రత్యేక హట్‌లు
- ఆధునిక హంగులు, సౌకర్యాలతో నిర్మాణం
- సర్వాంగ సుందరంగా వసతి గృహాలు
- ప్రముఖ పర్యాటక కేంద్రంగా కోరంగి అభయారణ్యం

తాళ్లరేవు: ప్రముఖ పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకున్న కోరంగి అభయారణ్యాన్ని సందర్శించే పర్యాటకుల కోసం అటవీశాఖ ప్రత్యేక హట్‌లను(వసతి గృహాలు) అందుబాటులోకి తీసుకు వచ్చింది. దేశంలోనే రెండవ అతిపెద్ద మడ అటవీ ప్రాంతమైన కోరంగి అభయారణ్యాన్ని వేలాది మంది పర్యాటకులు సందర్శిస్తుంటారు. గతంలో ఇక్కడికి దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు విడిది చేసేందుకు కాకినాడ గానీ, యానాం, అమలాపురం పట్టణాలకు గానీ వెళ్లవలసి వచ్చేది. అయితే కోరంగిలోనే పర్యాటకులు సేదతీరడంతో పాటు అక్కడ బస చేసేవిధంగా అత్యాధునిక సౌకర్యాలతో అటవీశాఖ వసతి గృహాలను ప్రారంభించింది. కోరంగి పంచాయతీలోని ఫారెస్ట్ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఉన్న మూడు హట్‌లతో పాటు మరో ఫారెస్ట్ భవనాన్ని సైతం పర్యాటకులకు అందుబాటులోకి తెచ్చారు. ప్రతి గదిలో డబుల్ కాట్ బెడ్, ఏసీ, టీవీ, ఇన్వెర్టర్ సౌకర్యాలను కల్పించారు. పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు పూర్తిస్థాయిలో రక్షణ ఉండేవిధంగా చర్యలు చేపట్టారు. అంతేకాక ప్రాంగణంలోని బయో డైవర్సిటీ భవనాన్ని సందర్శిస్తే కోరంగి మడ అభయారణ్యం విశేషాలను తెలుసుకోవచ్చు. ప్రకృతి ఒడిలో సేదతీరాలనుకునే వారికి ఈ హట్‌లు ఒక వరంగా చెప్పవచ్చు.

అందుబాటులో ఆన్‌లైన్‌లో బుకింగ్



కోరంగి ఫారెస్ట్ కాంప్లెక్స్ ప్రాంగణంలో పర్యాటకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన హట్‌లలో సిబ్బంది ద్వారా గదులను కేటాయిస్తున్నాము. ఆన్‌లైన్‌లో కూడా బుకింగ్ చేసుకునే అవకాశం ఉంది. జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలను సందర్శించి ఇక్కడ బస చేయాలనుకునే వారికి ఇదో చక్కటి అవకాశం. మరిన్ని వివరాల కోసం 8985952875 నంబరులో సంప్రదిస్తే సిబ్బంది సహకరిస్తారు.

ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, ఫారెస్ట్ రేంజ్ అధికారి, కోరంగి అభయారణ్యం.

అందుబాటు ధరల్లో అద్దెలు

అటవీశాఖ ఏర్పాటు చేసిన ఈ హట్‌లలో ఒకరోజు బస చేసేందుకు రూ.1500 చెల్లించాల్సి ఉంటుంది. ఫారెస్ట్ కాంప్లెక్స్‌లో ఉన్న అటవీ శాఖ అధికారులను సంప్రదిస్తే ఈ గదులను కేటాయిస్తారు. పిల్లాపాపలు, కుటుంబ సభ్యులతో అధిక సంఖ్యలో వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం ఒకప్పటి ఫారెస్ట్ బంగ్లాను వీవీఐపీ రూముగా సాధారణ పర్యాటకులకు సైతం అద్దెకు ఇవ్వనున్నారు. ఈ బంగ్లాకు ఒకరోజుకు రూ.3వేల ఛార్జీ చేస్తారు. కోరంగి మడ అటవీ ప్రాంతాన్ని సందర్శించి ఒకరోజు ప్రకృతి ఒడిలో సేదతీరడం మరపురాని అనుభూతినిస్తుందని పలువురు పర్యాటకులు చెబుతున్నారు.

మహిళల భద్రతకు తొలి ప్రాధాన్యం



ఓపెన్‌హౌస్ సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్



విద్యార్థినులకు ఓపెన్ హౌస్‌పై అవగాహన కలిగిస్తున్న ఎస్సై హరీష్‌కుమార్

అమలాపురం రూరల్: మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ పేర్కొన్నారు. మహిళా భద్రతా వారోత్సవాల్లో భాగంగా అమలాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమంలో డీఎస్పీ పాల్గొని ప్రసంగించారు. వారం రోజుల పాటు మహిళల భద్రతపై వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. సీఐ ప్రశాంత్ కుమార్, రూరల్ ఎస్సై శేఖర్‌బాబు మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఉప్పలగుప్తం ఎస్సై రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్

అల్లవరం: మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని ఎస్సై హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో గోడిలంక ఉన్నత పాఠశాల విద్యార్థినులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని శనివారం స్థానిక పోలీస్ స్టేషన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లవరం సీహెచ్‌సీ వైద్యాధికారి పృథ్వీ విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎస్సై హరీష్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలలో గానీ, పరిసరాల్లో గానీ ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా, ఇబ్బందులకు గురి చేసినా సమీపంలోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలన్నారు. విద్యతో పాటు క్రమశిక్షణ, సంస్కారాన్ని ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలన్నారు. ఓపెన్ హౌస్‌లో భాగంగా పోలీస్‌స్టేషన్లో లాకప్, వైర్‌లెస్ పనితీరు, కౌన్సెలింగ్ రూమ్, రెస్టు రూమ్, పోలీస్ వ్యవస్థ పని తీరుపై విద్యార్థులకు ఎస్సై వివరించారు. ఏఎస్సైలు సత్యనారాయణ, శివారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా రక్షణకు ప్రత్యేక చట్టాలు

అమలాపురం రూరల్: ఆడ పిల్లలు ఇంటికి వెలుగని, అటువంటి ఆడపిల్లల రక్షణ, భవిష్యత్ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు తీసుకువచ్చాయని ఐసీడీఎస్ పీడీ శాంత కుమారి పేర్కొన్నారు. మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని అమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి విజయశ్రీ ఆధ్వర్యంలో శనివారం పలు కార్యక్రమాలు చేపట్టారు. బండారులంక హైస్కూల్‌లో విద్యార్థినులతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటారు. సూపర్‌వైజర్లు అన్నపూర్ణేశ్వరి, విజయ కుమారి, మహేశ్వరి, అహ్మద్ ఉన్నీసా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బండారులంకలో మొక్కలు నాటుతున్న పీడీ శాంత కుమారి

అక్రమ కేసులపై దళిత నేతల ఫిర్యాదు



డీఎస్పీ ప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తున్న జిల్లా దళిత సంఘాల జేఏసీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: గల్ఫ్ దేశాల్లో ఉంటున్న జిల్లాకు చెందిన కొందరు యువకులు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను దూషిస్తూ సోషల్ మీడియాల్లో పోస్టులు పెడుతూ కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని జిల్లా దళిత సంఘాల జేఏసీ ప్రతినిధులు ఆరోపించారు. సోషల్ మీడియాల్లో వస్తున్న పోస్టులపై స్పందించిన దళితులపై మంత్రి వాసంశెట్టి సుభాష్ అండదండలతో అక్రమ కేసులు పెట్టి గల్ఫ్ దేశాల్లో ఉంటున్న దళితులు ఇక్కడ ఉంటున్న వారి తల్లిదండ్రులను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా దళిత జేఏసీ నాయకులు అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్‌ను శనివారం సాయంత్రం కలిసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు అందించారు. అసభ్యకరంగా పోస్టులు పెడుతున్న బాధ్యులతో పాటు ఫోన్లలో బెదిరించి అక్రమ కేసులు బనాయిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదు పత్రంలో దళిత నాయకులు డిమాండ్ చేశారు.

ఫైలేరియా, మలేరియా నిర్మూలనకు చర్యలు

అమలాపురం టౌన్: స్థానిక ముస్లింవీధిలో దోమల నిర్మూలనకు నిర్వహిస్తున్న యాంటీ లార్వా ఆపరేషన్‌ను నేషనల్ ఫైలేరియా కంట్రోల్ ప్రోగ్రామ్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సీనియర్ ఎంటమాలజిస్ట్ నక్కా వెంకటేశ్వరరావు శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ డ్రైనేజీల్లో చెత్త వేయడం, నీటి నిల్వలు ఉండటం ద్వారా దోమల ఉధృతి పెరుగుతుందన్నారు. దోమ కాటు ఫైలేరియా, మలేరియా, డెంగీ వ్యాధులకు కారణమవుతుందని గుర్తు చేశారు. తొలుత స్థానిక ఏవీఆర్ నగర్‌లో గల నేషనల్ ఫైలేరియా కంట్రోల్ ప్రోగ్రామ్ యూనిట్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట హెల్త్ ఇన్‌స్పెక్టర్ సాపే సత్యనారాయణ, ఎస్ఎఫ్‌డబ్ల్యూ గనిశెట్టి రమణలాల్, ఐసీ తుట్టిపు సూర్య ప్రకాశరావు, ఫీల్డ్ వర్కర్ ప్రసాద్ ఉన్నారు.



ముస్లిం వీధిలో డ్రెయిన్లను పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు

పాఠశాల వార్షికోత్సవానికి సన్నాహాలు

- పూర్వ విద్యార్థి, ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు వెల్లడి
- హాజరు కానున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

అమలాపురం టౌన్: అమలాపురంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఏర్పాటై 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వచ్చే జూన్ నెలలో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు వెల్లడించారు. వార్షికోత్సవం నిర్వహణపై ముందస్తుగా 1974వ సంవత్సరంలో ఆ పాఠశాలలో చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థులు శనివారం అదే పాఠశాలలో సమావేశమై చర్చించారు. ఇదే బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి, ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని వార్షికోత్సవ వేడుకల నిర్వహణపై మాట్లాడారు. ఈ వేడుకలకు భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడిని ముఖ్య అతిథిగా ఆహ్వానించనున్నట్లు ఎమ్మెల్సీ వెల్లడించారు. ఈ అపురూప వేడుకలకు ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు, విద్యావేత్తలు, దేశం నలు మూలల్లో ఉన్న పాఠశాల పూర్వ విద్యార్థులను ఆహ్వానించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శిష్ట రామగోపాలం, మంగిపూడి సత్యప్రసాద్, వటనేని రమణ, పెదమల్లు రామరావు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ సూర్యనారాయణరావును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

సేవామూర్తికి ఘన నివాళులు

అమలాపురం రూరల్: అడ్వకేట్, సోషల్ వర్కర్ పచ్చిమాల బాబ్జి సంతాప సభ అమలాపురం మండలం వన్నెచింతలపూడి అంబేడ్కర్‌నగర్‌లో శనివారం జరిగింది. బాబ్జి సతీమణి చంద్రకాంతం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమలాపురం బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు పెనుమల సుధీర్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. మాజీ ఐఆర్ఎస్ అధికారి పీఎస్ఎన్ మూర్తి, దళిత నాయకులు జంగా బాబురావు, కారేం వెంకటేశ్వరావు, ఎంఏకే భీమారావు తదితరులు నివాళులు అర్పించారు. రచయిత మాగాపు ఈశ్వరరావు, శరత్‌లు బాబ్జిపై ప్రత్యేక పోస్టర్లను ఆవిష్కరించి ప్రజలకు అందించారు. కార్యక్రమంలో కుమారులు వీర ప్రతాప్, లెనిన్ బాబ్జి, పరమట భీమ మహేష్, నాయకులు పాల్గొన్నారు.



సంతాప సభలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఐఆర్ఎస్ అధికారి మూర్తి, నాయకులు

యూ ట్యూబర్‌పై కేసు

అమలాపురం రూరల్: బాలయోగి స్టేడియంలో గోల్డ్ హంట్ పేరుతో స్టేడియంలో గుంతలు తవ్విన ఘటనపై కేసు నమోదు చేసినట్లు తాలూకా ఎస్సై శేఖర్‌బాబు తెలిపారు. గోల్డ్ హంట్ పేరిట యూ ట్యూబర్ మూడు వందల మందితో స్టేడియం గ్రౌండ్‌లో గోతులు తీయించిన విషయం సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి రావడంతో క్రీడా అభివృద్ధి సంస్థ చీఫ్ కోచ్ సురేష్‌కుమార్ అడ్డుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం మండపాటి ఆదిత్య అనే వ్యక్తి తన ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్స్ కోసం గోల్డ్ హంట్ అనే టాస్క్ పెట్టి ఆ టాస్క్ లో భాగంగా స్టేడియంలో బంగారం దాచి పెట్టినట్లు కొంత మందికి చెప్పారన్నారు. ఆ బంగారాన్ని కనుగొన్న వారికి బహుమతులు లభిస్తాయని చెప్పడంతో కొంతమంది వ్యక్తులు అనధికారకంగా బాలయోగి స్టేడియంలోకి ప్రవేశించారని ఎస్సై చెప్పారు. ఘటనపై స్టేడియం క్రీడాభివృద్ధి సంస్థ చీఫ్ కోచ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు యూ ట్యూబర్ మండపాటి ఆదిత్యపై అమలాపురం తాలూకా పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు శేఖర్‌బాబు తెలిపారు.



యూ ట్యూబర్ ఆదిత్య

హస్త కళాకృతుల తయారీపై మహిళలకు శిక్షణ

అమలాపురం రూరల్: విజయవాడ కొబ్బరి అభివృద్ధి బోర్డు సహకారంతో డీఆర్‌డీఏ, సెర్ప్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా శాఖల ఆధ్వర్యంలో హస్తకళల తయారీపై శిక్షణా కార్యక్రమాన్ని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శనివారం నిర్వహించారు. కొబ్బరి పెంకులు, చిప్పలతో ఆకర్షణీయమైన హస్త కళాకృతులను రూపొందించటంలో స్వయం సహాయక సంఘ మహిళలకు 6 రోజులు శిక్షణ నిర్వహించారు. బిహార్ నుంచి వచ్చిన ప్రముఖ హస్తకళా శిక్షకుడు నికుంజ్ బీహారీ శిక్షణ అందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శివ శంకరప్రసాద్, అడిషనల్ పీడీ నాగేశ్వరరావు, కొబ్బరి అభివృద్ధి బోర్డు ఫీల్డ్ ఆఫీసర్ కిరణ్ కుమార్లు మాట్లాడుతూ దేశ విదేశాలలో కొబ్బరి ఆధారిత హస్తకళా వస్తువులకు మంచి గిరాకీ ఉందన్నారు.



కళాకృతుల తయారీపై శిక్షణ ఇస్తున్న అధికారులు

మాదిగ అమరవీరులకు ఘన నివాళి

ముమ్మిడివరం: ఎస్సీ వర్గీకరణ పోరాటంలో ప్రాణ త్యాగాలు చేసిన అమరవీరులకు శుక్రవారం ఘన నివాళులు అర్పించారు. ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు స్థానిక పోలమ్మ చెరువు వద్ద మాదిగ అమరవీరుల సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళులు అర్పించారు. మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధికార ప్రతినిధి నూటికుర్తి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమానికి ఎంఎస్‌పీ జిల్లా కోశాధికారి ఖండవిల్లి వెలియ అధ్యక్షత వహించారు.

ఐ.పోలవరం: ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణ త్యాగాలు చేసిన మాదిగ అమర వీరులను ఎన్నటికీ మరువ లేమని, వారి త్యాగాలను జాతి ఉన్నంత కాలం గుర్తుంచుకుంటామని జిల్లా ఎంఆర్‌పీఎస్ ఉపాధ్యక్షుడు వీధి చిరంజీవి మాదిగ అన్నారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు మండలంలో కొమరగిరి జాంబవనపేట కొత్త కాలనీలో శనివారం మాదిగ అమరవీరుల సంస్మరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో నవరపు శ్రీనివాస్, వీధి సత్తిపండు, నవరపు కొండ, వీధి వీరస్వామి, నవరపు సాయిబాబు, వీధి బాలస్వామి, నవరపు చిన్న కృష్ణమూర్తిలు పాల్గొన్నారు.



ముమ్మిడివరంలో అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న నాయకులు

కార్నియాల సేకరణలో బాబీ కృషి అభినందనీయం



బాబీకి జ్ఞాపికను అందజేస్తున్న శ్రీనివాస్

తాళ్లరేవు: నేత్రదానంపై అవగాహన కల్పించి మరణానంతరం మృతుల కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రదానం చేయించడం(కార్నియాల సేకరణ)లో లయన్ ధూళిపూడి వెంకటరమణ(బాబీ) చేస్తున్న సేవలు అభినందనీయమని లయన్స్ జిల్లా ద్వితీయ గవర్నర్ చిట్టీడి శ్రీనివాస్ అన్నారు. కాకినాడలో జరిగిన కార్యక్రమంలో నేత్రదానంలో 316బి లయన్స్‌క్లబ్ జిల్లా మొదటి స్థానంలో నిలిచిన కారణంగా బాబీకి జ్ఞాపికను అందజేశారు. రీజనల్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కార్నియాల సేకరణలో బాబీ చేస్తున్న కృషి కారణంగా అనేక మంది అంధత్వంతో బాధ పడుతున్న వారి కళ్లల్లో ఆనందం చూస్తున్నామన్నారు. బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్ సేవలు అభినందనీయమన్నారు.

నాగేశ్వరరావుకు సత్కారం

కాట్రేనికోన: బంటుమిల్లి గ్రామంలో ఈశ్వర కొబ్బరి ఒలుపు కార్మిక సంఘం అధ్యక్షులుగా యనమదల నాగేశ్వరరావు 41 ఏళ్ల పాటు పని చేసిన సందర్భంగా శనివారం సంఘ కార్యవర్గ సభ్యులు, వ్యాపారులు, కార్మికులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఒలుపు కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు ఎలిపే లక్ష్మణరావు అధ్యక్షతన కార్యక్రమం జరిగింది.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



ప్రేక్షకులకు రహదారి భద్రతపై సూచనలిస్తున్న డీఎస్పీ ప్రసాద్

ఉప్పలగుప్తం: వాహన చోదకులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ అన్నారు. మండలంలోని గొలవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో భాగంగా ప్రేక్షకులకు శనివారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. రూరల్ సీఐ ప్రశాంత్ కుమార్, ఎస్సై రాజేష్ పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ముమ్మిడివరం: మండల పరిధిలోని కొమానపల్లిలో ఓ ఇంటిలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ముమ్మిడివరం పోలీసులు దాడి చేశారు. శుక్రవారం రాత్రి పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్సై జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడిలో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.5,040 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జ్వాలాసాగర్ తెలిపారు.

మినీబస్ ఢీకొని యువకునికి గాయాలు



చొల్లంగిపేటలో బైక్‌ను ఢీకొన్న మినీబస్

తాళ్లరేవు: జాతీయ రహదారిలోని చొల్లంగిపేట వివేకానంద స్కూల్ వద్ద శుక్రవారం రాత్రి మినీబస్ ఢీకొన్న ఘటనలో బొడ్డు దుర్గాప్రసాద్ అనే యువకుడికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కాకినాడ నుంచి చొల్లంగిపేటకు బైక్‌పై వెళుతున్న దుర్గా ప్రసాద్‌ను ఎదురుగా వస్తున్న మినీబస్ ఢీకొంది. ఈ ప్రమాదంలో దుర్గాప్రసాద్‌కు తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఈ కేసుకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదు నమోదు కాలేదని కోరంగి పోలీసులు తెలిపారు.

బూత్ కమిటీలు ఏర్పాటు చేయాలి

అమలాపురం రూరల్: మండల కమిటీలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసి ప్రతి మండలంలో బూత్ కమిటీల ఏర్పాటును పూర్తి చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల మధుకర్‌జీ సూచించారు. పార్టీ జిల్లా పదాధికారులు, నూతన మండల అధ్యక్షుల సమావేశం అమలాపురంలోని సత్యనారాయణ ఫంక్షన్ హాల్‌లో జిల్లా బీజేపీ అధ్యక్షులు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన శనివారం జరిగింది.

నూకాంబిక జాతరకు శ్రీకారం

ఆలమూరు: కోస్తా జిల్లాల్లో ప్రసిద్ధి చెందిన చింతలూరు నూకాంబిక అమ్మవారి ఉత్సవాలకు శనివారం శ్రీకారం జరిగింది. ఏటా కొత్త అమావాస్య వచ్చే నెల రోజుల ముందు అమ్మవారిని బుట్టగరగ రూపంలో అలంకరణ చేసి ప్రజలకు దర్శనమివ్వడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా ఆలయ ఈవో ఉండవల్లి వీర్రాజుచౌదరి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అమ్మవారి బుట్టగరగను ఆలయ అర్చకులు నెత్తిన ధరించి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. మార్చి 28న పెద్ద జాగరణ, 29న తీర్థం, 30న ఉగాది పర్వదినాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ తెలిపింది. నూకాంబిక అమ్మవారి బుట్ట గరగ రూపంలో పర్యటించిన గ్రామాల్లో పాడిపంటలు, అష్టైశ్వర్యాలు, భోగ భాగ్యాలతో అలరించడంతో పాటు ఏవిధమైన అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజలందరూ సుభిక్షంగా ఆరోగ్యంగా ఉంటారని తమ ప్రగాఢ విశ్వాసమని భక్తులు చెబుతుంటారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ శేషుబాబు, గన్ని చిన్నబ్బు, సూరిబాబు పాల్గొన్నారు.